సాక్షి
అనంతపురం
బుధవారం । 5 । జూలై । 2023



చీనీ టన్ను రూ.25 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.25 వేలు పలికాయి.



బోనాల సందడి

అనంతపురంలో బంజారాల బోనాల జాతర అంబరమంటింది. గ్రామ దేవతలకు మహిళలు బోనాలు సమర్పించారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
36.7°/ 23.4°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

సత్యసాయిసేవలో గవర్నర్




సత్యసాయి మహాసమాధి చెంత రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రశాంతి నిలయం: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మంగళవారం సత్యసాయి సన్నిధిలో గడిపారు. సోమవారం రాత్రి ప్రశాంతి నిలయం చేరుకున్న ఆయన శాంతిభవన్ అతిథి గృహంలో బస చేశారు. మంగళవారం ఉదయం 9.45 గంటలకు సాయికుల్వంత్ మందిరం చేరుకుని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా కార్యక్రమాలను, నిత్యం సాయికుల్వంత్ సభా మందిరంలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమం గురించి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు గవర్నర్‌కు వివరించారు. అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 2.15 గంటలకు శాంతిభవన్ అతిథి గృహం నుంచి రోడ్డు మార్గాన ప్రత్యేక కాన్వాయ్‌లో బెంగళూరు వెళ్లారు. కలెక్టర్ అరుణ్ కుమార్, ఎస్పీ మాధవరెడ్డి గవర్నర్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు.

వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా అశోక్‌కుమార్‌రెడ్డి

- అధికార ప్రతినిధిగా ఓబుళపతి



అశోక్‌కుమార్‌రెడ్డి



ఓబుళపతి

రాప్తాడురూరల్: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన ఇద్దరికి కీలక పదవులు వరించాయి. రాష్ట్ర అధ్యక్షుడిగా పి.అశోక్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధిగా కె.ఓబుళపతిని ఎన్నుకున్నారు. ఈ మేరకు మంగళవారం తాడేపల్లిలో టీచర్స్ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి అధ్యక్షతన వైఎస్సార్‌టీఎఫ్ కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రతి విద్యాభివృద్ధి కార్యక్రమంలోనూ వైఎస్సార్‌టీఎఫ్ భాగస్వామ్యమై పిల్లలకు ఆ ఫలాలు అందేలా చూడాలని వక్తలు కోరారు. అనంతరం రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీలో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి పలువురికి చోటు కల్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు, అధికార ప్రతినిధితో పాటు ఉపాధ్యక్షులుగా గోవిందరెడ్డి, హెచ్.గిరిధర్ రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, పుల్లారెడ్డి, జంషీద్, కార్యదర్శులుగా శివయ్య, వెంకటరమణ, గంగాధర్ రెడ్డిని ఎన్నుకున్నారు.

వైఎస్సార్‌సీపీ 'పురం' సమన్వయకర్తగా దీపిక



హిందూపురం టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా కురుబ సామాజిక వర్గానికి చెందిన టీ.ఎన్.దీపిక నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెల్లువడ్డాయి. హిందూపురం మండలం పెద్దగుడ్డంపల్లికి చెందిన దీపిక ఎంసీఏ పూర్తి చేసి బెంగళూరు యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసేవారు. ప్రజాసేవ చేయాలని భావించిన ఆమె ఇటీవల ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చారు. ఆమె భర్త వేణురెడ్డి వైఎస్సార్ కుటుంబానికి విధేయుడిగా ఉంటూ వైఎస్సార్ సీపీ పటిష్టతకు ఆవిర్భావం నుంచీ పనిచేశారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయ సాధనే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. పార్టీలో అందరినీ కలుపుకుని హిందూపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడానికి శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు.

నెట్టికంటుడి హుండీ ఆదాయం రూ.42.27 లక్షలు

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ. 42.27 లక్షల ఆదాయం లభించినట్లు ఈఓ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకలను మంగళవారం ఆలయంలో లెక్కించారు. హుండీ ద్వారా 47 రోజులకు గాను రూ.42,27,434, అన్నదాన హుండీ ద్వారా రూ.41,024 వచ్చింది. 9 గ్రాముల బంగారు, 3.6 కిలోల వెండిని కానుకల రూపంలో భక్తులు సమర్పించారు. ఆలయ పాలకమండలి సభ్యులు, అధికారులు, హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆర్టీసీ సేవాసమితి, బళ్లారి వీరభద్రసేవా సమితి సభ్యులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

ఆశలన్నీ వరుణుడి పైనే!

- టీబీ డ్యాంకు పెరగని ఇన్‌ఫ్లో
- అన్నదాతల ఆందోళన
- వానల కోసం ఎదురుచూపులు
- నార్లు పోయడానికి అదను దాటుతుందనే కలవరం

బొమ్మనహాళ్: రాయలసీమకు సాగు, తాగునీరు అందించే తుంగభద్ర జలాశయం(టీబీడ్యాం)లో రోజురోజుకూ నీటి మట్టం పడిపోతోంది. హెచ్చెల్సీ ద్వారా ఉమ్మడి అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల్లోని 2.85 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ముఖ్యమైన జలవనరులో జూలై మొదటి వారం వచ్చినా మూడు టీఎంసీలకు మించి నీరు నిల్వ లేదు. దీంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయకట్టుకు సరైన సమయంలో నీరు అందుతాయో? లేదో? అన్న సందిగ్ధంలో పడ్డారు.

ఎగువ ప్రాంతాల్లో కానరాని వరుణుడు..


కర్ణాటకలోని తుంగభద్ర జలాశయ ఎగువ ప్రాంతాలైన హరిహర, శివమొగ్గ, తీర్థహళ్లి, ఆగుంబేలో తీవ్ర వర్ష భావం నెలకొంది. డ్యాంలోకి ఇన్‌ఫ్లో పెరగకపోయినా కమలాపురం, హొస్పేట్, సిరుగుప్ప ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు అత్యవసర నిమిత్తం రోజూ 136 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండడం గమనార్హం.

40 రోజుల ముందే నార్లు..

జిల్లాలోని బొమ్మనహాళ్, కణేకల్లు, డీ హీరేహాళ్, విడపనకల్లు మండలాల రైతులు కాలువకు నీరు వస్తాయన్న ఆలోచనతో 40 రోజుల ముందే బోర్ల కింద వరి, మిరప నారు పెంచుకుంటారు. గతేడాది వర్షాలు బాగా పడ్డాయి. ఈ ఏడాది కూడా పరిస్థితి అలానే ఉంటుందనే నమ్మకంతో కొందరు బోర్ల కింద నారు పెంచుకున్నారు. అయితే, జలాశయానికి ఇన్‌ఫ్లో పెరగకపోవడం చూసి వారిలో కలవరం మొదలైంది.

వర్షాలు లేకే ఇన్‌ఫ్లో లేదు..

తుంగభద్ర జలాశయ ప్రాంతంలో వర్షాలు పెద్దగా పడడం లేదు. దీంతో డ్యాంకు ఇన్‌ఫ్లో గణనీయంగా పెరగడం లేదు. ప్రస్తుతం 798 క్యూసెక్కులు మాత్రమే నీరు వస్తోంది. అవుట్‌ఫ్లో మాత్రం 136 క్యూసెక్కులుగా ఉంది. వానలు పడి వరద వస్తేనే గణనీయంగా ఇన్‌ఫ్లో పెరుగుతుంది.



వెలవెలబోతున్న తుంగభద్ర జలాశయం

తుంగభద్ర జలాశయం సామర్థ్యం 1,632 అడుగులు

	ప్రస్తుత	గతేడాది ఇదే సమయానికి
నీటిమట్టం	1,576.65 అడుగులు	1614.90 అడుగులు
నిల్వ ఉన్న నీరు	3.060 టీఎంసీలు	48.180 టీఎంసీలు
ఇన్‌ఫ్లో	798 క్యూసెక్కులు	11,370 క్యూసెక్కులు

నార్లు పోసుకునేందుకు వెనుకంజ



ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల కావొస్తున్నా తుంగభద్ర జలాశయానికి మూడు టీఎంసీలకు మించి నీరు రావడం లేదు. దీంతో బోర్ల కింద నార్లు పోసుకోవడానికి వెనుకంజ వేస్తున్నాం. పంటకు ఈ సారి పూర్తి స్థాయిలో నీరు అందుతాయా లేదా అన్న అనుమానం ఉంది. ఆరుద్ర కార్తెలో నార్లు పెంచుకుంటే పంటలు బాగా పండుతాయని రైతుల నమ్మకం.

– హనుమేష్, రైతు దేవగిరి

వానల కోసం ఎదురుచూస్తున్నాం



తుంగభద్ర జలాశయానికి నీరు వస్తుందని రైతులంతా ఎదురు చూస్తున్నాం. గత సంవత్సరం వర్షాలు బాగా పడడంలో జలాశయంలోకి వరద పోటెత్తింది. ఈ సారి డ్యాంలో నీరు మూడు టీఎంసీలే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లోనూ తాగునీటి అవసరాల కోసం 136 క్యూసెక్కుల అవుట్ ఫ్లో కొనసాగుతోంది. జలాశయంలో నీరు పెరిగితేనే నార్లు పోసుకుంటాం.

– ప్రసాద్‌రెడ్డి, రైతు ఉద్దేహాళ్



హెచ్చెల్సీ ఆయకట్టు భూములు

తెలుగుజాతి ముద్దుబిడ్డ అల్లూరి



అల్లూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్

అనంతపురం: బ్రిటీష్ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన తెలుగుజాతి ముద్దుబిడ్డ అల్లూరి సీతారామరాజు అని కలెక్టర్ ఎం.గౌతమి అన్నారు. కలెక్టర్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. స్వరాజ్యం కోసం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. మహనీయుల త్యాగాలను ఎన్నటికీ మరువరాదన్నారు. గిరిజనులకు అండగా నిలిచి వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి అల్లూరి సీతారామరాజు కృషి చేశారన్నారు. ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర వర్గాల అభ్యున్నతికి పాటుపడుతోందన్నారు. విద్య, వైద్య రంగాలకు ఎంతో ప్రాధాన్యతనిచ్చి అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. విద్య వల్లనే ఉన్నతస్థాయి లభిస్తుందన్న విషయాన్ని విద్యార్థులు గుర్తుపెట్టుకోవాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాల కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ గాయత్రీదేవి, హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి అన్నా దొర, గిరిజన సంఘాల ప్రతినిధులు శివశంకర్, ఉమాదేవి, చిరంజీవి, పోలా వీర, సంగీత, నందిని తదితరులు పాల్గొన్నారు.

నేడు భీమలింగేశ్వరుడి రథోత్సవం


ఉరవకొండ(విడపనకల్లు): విడపనకల్లు మండలం గడేకల్లులో వేములవాడ భీమలింగేశ్వర స్వామి రథోత్సవం బుధవారం జరగనుంది. ఉదయం విశేష పూజలు, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నారు. మంగళవారం స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన మద్యం, మాంసం ఊరేగింపుగా తీసుకెళ్లి జీవసమాధి వద్ద ఉంచి పూజలు చేశారు. అనంతరం కలశాలను రథంపై ప్రతిష్టించారు.

● మేఘం కురిసేనా.. రైతు మోము మురిసేనా..?



ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది..జూన్ నెలలో తొలకర్లు పలకరించాయి. అన్నదాతలు ముంగారు సేద్యాలు ముగించారు. పదును వర్షం కురిస్తే సాగు చేయాలని సమాయత్తమయ్యారు. పొద్దంతా ఎండ కాసి.. సాయంత్రంకల్లా మేఘాలు ఆడుతున్నాయి. నైరుతి రుతుపవనాలు ఆశలు రేపుతున్నాయి. బంగాళాఖాతంలో ఉన్న ఉపరితల ఆవర్తన ప్రభావంతో వర్షాలు కురుస్తాయని ఆశిస్తున్నారు. నీలిమేఘమా.. జాలిచూపుమా అంటూ రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



అనంతపురంలో మంగళవారం సాయంత్రం మేఘాలు కమ్ముకున్న దృశ్యాలు

రైతు కుటుంబాలకు ఆపన్నహస్తం

- ఎక్స్‌గ్రేషియా పథకంతో ఆదుకున్న జగన్ సర్కార్
- ఒక్కో కుటుంబానికి రూ.7 లక్షల పరిహారం జమ
- తాజాగా 10 కుటుంబాల ఖాతాలకు రూ.70 లక్షల జమ



అనంతపురం అగ్రికల్చర్: అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆపన్నహస్తం అందిస్తోంది. పంట నష్టం, బోరుబావుల వైఫల్యం, అధిక సాగు ఖర్చు, వ్యవసాయ ఉత్పత్తులను తక్కువ ధరకు విక్రయించడంతో పాటు పిల్లల చదువులు, వివాహ ఖర్చులు తదితర వాటి కోసం చేసిన అప్పులు తీర్చలేని స్థితిలో రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. అలాంటి రైతు కుటుంబాలను ఆదుకునేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు 'ఆంధ్రప్రదేశ్ రైతుల ఆత్మహత్య ఎక్స్–గ్రేషియా' పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.7లక్షల పరిహారం అందిస్తోంది. అది కూడా నెల నుంచి రెండు నెలల వ్యవధిలోపే సాయం అందేలా చర్యలు తీసుకుంటోంది. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు సత్వరమే న్యాయం చేయడానికి వీలుగా అధికారులతో ప్రత్యేక కమిటీ వేయడంతో పాటు వ్యవసాయశాఖ కార్యాలయంలో ప్రత్యేక విభాగం అందుబాటులోకి తెచ్చారు. నిధుల కొరత ఏర్పడకుండా సాధ్యమైనంత తొందరగా పరిహారం ఇవ్వడానికి గ్రీన్‌ఛానల్ ఏర్పాటు చేశారు. మరీ అత్యవసరం అనుకుంటే కలెక్టర్ కార్పస్ ఫండ్ ద్వారా ఆదుకుంటున్నారు.

బాబు హయాంలో రైతులపై చిన్నచూపు

చంద్రబాబు హయాం (2014–19)లో వర్షాలు లేవు, పంటలు పండలేదు. ఏటా నష్టాలు చవిచూశారు. చేసిన అప్పులు తీరక, కొత్త అప్పులు పుట్టక, పిల్లల చదువులు, పెళ్లిళ్లు చేయలేని దుస్థితిలో 400 మందికి పైగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అయినా అప్పటి ప్రభుత్వం సాయం చేయడానికి ముందుకు రాలేదు. 'పరిహారం ఇస్తూ పోతే దానికోసమైనా చస్తారు' అంటూ హేళన చేశారు. కేవలం 105 మంది రైతులకు రూ.5 లక్షల చొప్పున రూ.5.25 కోట్లు పరిహారం అందించారు. అది కూడా విడతల వారీగా. మిగిలిన వారిని జాబితా నుంచి తొలగించి, ఇంకొందరికి రిక్తహస్తం చూపించారు.

- చంద్రబాబు హయాంలో ఆత్మహత్య చేసుకున్న 120 మంది రైతుల కుటుంబాలకు కూడా వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే రూ.5 లక్షల చొప్పున ఒకేసారి వారి బ్యాంకు ఖాతాలకు రూ.6 కోట్లు జమ చేసి మానవత్వం చాటుకున్నారు.

తాజాగా 10 కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా

ఈ ఏడాదిలో వివిధ కారణాలతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.7 లక్షల చొప్పున పరిహారం అందించినా... జగన్ ప్రభుత్వం ఎక్కడా ప్రచార ఆర్భాటానికి పోలేదు. లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా పరిహారం జమ చేసిన తర్వాత సమాచారం ఇస్తున్నారు. ఇలా ఇటీవల కాలంలో పది మంది రైతుల కుటుంబాలకు రూ.70 లక్షలు జమ చేశారు. కె.హరి (కందుకూరు), గువ్వల సూర్యనారాయణ రెడ్డి (రాచానపల్లి), ఇస్లావత్ శ్రీనివాసులునాయక్ (కమలాపురం), నేనావత్ బాలునాయక్ (పాల్తూరు), మీనుగ సంజీవ (మరుట్ల), సాకే సతీష్ (బోళసముద్రం), సదం నగేష్ (సొరకాయలపేట), ఎం.మార్కండేయ (క్రిష్టిపాడు), చెరకూరి నాగమనాయుడు (సి.వెంగన్నపల్లి), ముగోళ్ల ఓబయ్య (కూచివారిపల్లి) అనే రైతుల కుటుంబ సభ్యుల ఖాతాల్లో రూ.7 లక్షల చొప్పున సొమ్ము జమ చేశామని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు.

అవ్వాతాతలకు 'కంటి వెలుగు'

- ఉమ్మడి జిల్లాలో 3 లక్షలకు చేరువలో నేత్ర పరీక్షలు
- అవసరమైన వారికి ఆపరేషన్లు, కళ్లద్దాలకు ఎంపిక
- క్యాటరాక్ట్ సర్జరీల్లో రాష్ట్రంలోనే శ్రీసత్యసాయి జిల్లాకు మూడో స్థానం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: గ్రామీణ ప్రాంతాల్లో నాలుగేళ్లకు ముందు కంటిచూపు మందగిస్తే పేదలు వైద్యం చేయించుకునే పరిస్థితి లేదు. మసక చూపుతోనే కాలం వెళ్లదీయాల్సి వచ్చేది. జగన్ ప్రభుత్వం వచ్చాక 'వైఎస్సార్ కంటి వెలుగు' కార్యక్రమంతో 60 ఏళ్లు దాటిన అవ్వాతాతల ముఖంలో వెలుగు కనిపించింది. వైద్యపరీక్షలు మొదలుకొని ఆపరేషన్లు, కంటి అద్దాల పంపిణీ అన్నీ ఉచితంగానే చేసి వారి కళ్లలో కాంతి నింపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కంటి పరీక్షలు చేయించుకున్న వారి సంఖ్య 3 లక్షలకు చేరువలో ఉండటం గమనార్హం. యుద్ధప్రాతిపదికన నడుస్తున్న కంటి వెలుగు కార్యక్రమం దేశంలోనే మొదటిసారి ఆంధ్రప్రదేశ్‌లో మొదలైంది. క్యాటరాక్ట్ సర్జరీల్లో రాష్ట్రంలోనే శ్రీసత్యసాయి జిల్లా మూడో స్థానంలో నిలిచింది.



గన్నెవారిపల్లి కాలనీలో వైఎస్సార్ ఉచిత కంటి వెలుగు కార్యక్రమంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అవ్వా తాతల ముఖాల్లో చిరునవ్వు

అరవై ఏళ్లు దాటిన వారు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 4.60 లక్షల మందికి పైనే ఉన్నారు. వీరిలో చాలామంది కంటిచూపు మందగించడంతోతో బాధపడుతున్నారు. చాలామంది వైద్యపరీక్షలు చేయించుకోలేని, కంటి అద్దాలు తెచ్చుకోలేని పరిస్థితిలో ఉన్నారు. అలాంటి అవ్వాతాతల కోసం కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 1.20 లక్షల కళ్ల అద్దాలకు ప్రభుత్వం ఆర్డర్ చేసింది. శుక్లాలతో బాధపడే అవ్వా తాతలకైతే ఉచితంగా ఆపరేషన్లు చేసి కళ్ల అద్దాలు ఇచ్చారు. ఇప్పటివరకూ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 15 వేల దాకా సర్జరీలు చేశారు. ప్రతి ప్రైవేటు కంటి ఆస్పత్రినీ 'కంటి వెలుగు'లో భాగం చేశారు. త్వరలోనే 60 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ కంటిపరీక్షలు పూర్తిచేసే లక్ష్యంతో ముందుకెళుతున్నారు.

అనంతపురం జిల్లాలో జూన్ 30 వరకు 'కంటి వెలుగు' ఇలా..	
60 ఏళ్లు దాటిన వారి సంఖ్య	2,38,385
కంటిపరీక్షలు చేయించుకున్న వారు	1,43,816
అద్దాలు ఆర్డర్ చేసింది	58,554
అద్దాలు తీసుకున్న వారు	32,507
క్యాటరాక్ట్ సర్జరీకి ప్రతిపాదన	7,025
క్యాటరాక్ట్ సర్జరీ చేయించుకున్న వారు	6,550

ఆపరేషన్‌తోనే చూపొచ్చింది



మలిసంధ్యలో చూపులేక లోకమంతా చీకటైంది. ఆపరేషన్ చేయించుకునే స్తోమత లేక కడదాకా అంధ జీవితమే దిక్కనుకున్నాను. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేయించి అద్దాలు పంపిణీ చేసి కంటి చూపు భాగ్యం కల్పించారు. ఈ పథకం తీసుకొచ్చిన సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– ఎర్రమ్మ, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్ మండలం

క్యాంపులు వేగవంతం



'కంటి వెలుగు' క్యాంపులు వేగవంతం చేసేందుకు పకడ్బందీ చర్యలు తీసుకున్నాం. దృష్టిలోపంతో బాధపడుతున్న వారికి స్క్రీనింగ్ చేసేందుకు 26 బృందాలు క్యాంపులు నిర్వహిస్తున్నాయి. ఆపరేషన్ అవసరమున్న వారికి ప్రభుత్వ సర్వజనాస్పత్రి, జీఎస్‌టీయూ వద్ద ఉన్న ఎస్‌పీసీబీతో పాటు మూడు స్వచ్ఛంద సంస్థకు చెందిన ఆస్పత్రుల్లో ఆపరేషన్లు జరుగుతున్నాయి.

– డాక్టర్ యుగంధర్, డీఎంహెచ్‌ఓ

జిల్లాలో నేడు, రేపు వర్షాలు

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో బుధ, గురువారాల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అశోక్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తేలికపాటి నుంచి మోస్తరుగా వర్షాలు పడవచ్చని పేర్కొన్నారు. కనీసం 20 మి.మీ వర్షపాతం నమోదైతే పంటలు విత్తుకునేందుకు అనువుగా ఉంటుందని తెలిపారు. ఖరీఫ్ సాగుకు నెలాఖరు వరకు సమయం ఉందని తెలిపారు.

క్లుప్తంగా

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి

కళ్యాణదుర్గం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో కళ్యాణదుర్గంలో సభ ఏర్పాట్ల పనులను ఎస్పీ కంచి శ్రీనివాసరావు, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. హెలీప్యాడ్ వద్ద సీఎంను స్వాగతించే ముఖ్య నేతల వివరాలు, వారు వేచి ఉండడానికి టెంట్లు, వీవీఐపీ, వీఐపీ గ్యాలరీలు తదితర అంశాలపై స్థానిక అధికారులతో సమీక్షించారు. అనంతరం కళ్యాణదుర్గం రూరల్, అర్బన్ సర్కిళ్ల పరిధిలో పని చేస్తున్న మహిళా పోలీసులతో స్థానిక ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో ఆయన సమావేశమై మాట్లాడారు. గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారానికి హోదాలు మరిచి పనిచేద్దామంటూ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ, డీఎస్పీ బి.శ్రీనివాసులు, సీఐలు జాకీర్ హుస్సేన్, శ్రీనివాసులు, తేజమూర్తి, యుగంధర్, పలువురు ఎస్‌ఐలు, గ్రామ/వార్డు మహిళా పోలీసులు పాల్గొన్నారు.

శింగనమల మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా సునీత



భూమిరెడ్డి సునీత

శింగనమల: శింగనమల మార్కెట్ యార్డ్ పాలకవర్గాన్ని నియమిస్తూ మంగళవారం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి ఉత్తర్వులు విడుదల చేశారు. కమిటీ గౌరవాధ్యక్షురాలిగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, చైర్‌పర్సన్‌గా భూమిరెడ్డి సునీత, వైస్ చైర్‌పర్సన్‌గా మూడ్ గీత, సభ్యులుగా ఎస్. శివమ్మ, గుజ్జల పుష్పావతి, విజయకుమార్, పొన్నూరు విజయలక్ష్మి, బాల సురేష్‌కుమార్, పిడుగు లక్ష్మీనారాయణ, బంగి జ్యోతి, పుట్లూరు లక్ష్మిరెడ్డి, మల్లేపల్లి గంగాదేవి, వై.శ్రావణి, నీలం శివశంకర్‌రెడ్డి, టి.అమీర్ బాషా, శింగనమల పీఏసీఎస్ ప్రెసిడెంట్ శ్రీరామిరెడ్డి, మార్కెటింగ్ ఏడీ, అనంతపురం ఏడీఏ, జంతులూరు సర్పంచ్‌ను నియమించారు.

బోనాల సందడి

బోనాలతో ఆలయానికి ర్యాలీగా బయలుదేరిన గిరిజన మహిళలు





ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు



సంప్రదాయ నృత్యంతో సందడి చేస్తున్న గిరిజనులు

అనంతపురం కల్చరల్: బంజారాల బోనాల జాతర మంగళవారం కనుల పండువగా సాగింది. అనంతపురంలోని నాయక్‌నగర్ పరిసరాలు బంజారా మహిళల ఆటపాటలతో సందడిగా మారాయి. పశు సంపద వృద్ధి, వాటి ఆరోగ్యం, తండాల సౌభాగ్యం కోరుతూ గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. అంతకు ముందు ఊరేగింపుగా తెచ్చిన సీత్లా యాడి, మరియామా, తోల్జాయాడి, కంకాళి, సాప్ల మయాడి, హింగిలాస్ భవాని, మత్రాళి ఏడుగురు అక్కమ్మ దేవతలను సుందరంగా అలంకరించి ప్రతిష్ఠించారు. వివిధ దేవతా రూపాలకు ఇష్టమైన వంటకాలను తలపై ఉంచుకుని శోభాయాత్రగా ఆలయానికి చేరుకున్న భక్తులు అందరికీ అమ్మవారి ప్రసాదాన్ని వితరణ చేశారు. వయసు తారతమ్యం లేకుండా సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. డివిజన్ కార్పొరేటర్ సాకే చంద్ర, జాతర నిర్వాహకులు చంద్రాబాయి, నారాయణ నాయక్, శంకర శివరావు రాథోడ్, రామకృష్ణానాయక్, లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

ఆస్తి కోసమే ఘాతుకం

- కురుబ గోవిందప్ప హత్య కేసులో వీడిన మిస్టరీ
- గత నెల 14న స్నేహితుడితో కలసి అన్నను హతమార్చిన తమ్ముడు
- రిమాండ్‌కు నిందితులు



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కళ్యాణదుర్గం: ఆస్తి కోసమే తోడబుట్టిన వాడిని హతమార్చిన తమ్ముడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ హత్యకు సహకరించిన మరో నిందితుడిని కూడా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ బి.శ్రీనివాసులు వెల్లడించారు. కళ్యాణదుర్గం మండలం కదరంపల్లి గ్రామానికి చెందిన కురుబ గోవిందప్ప గత నెల 14న రాత్రి హత్యకు గురైన విషయం తెలిసిందే. కొంత కాలంగా ఆస్తి పంపకాల విషయంగా తమ్ముడు కురబ రాము, గోవిందప్ప మధ్య వివాదం నడుస్తోంది. అప్పటి నుంచి అన్నపై కక్ష పెంచుకున్న రాము ఎలాగైనా గోవిందప్పను హతమారిస్తే మొత్తం ఆస్తి తనకు దక్కుతుందని భావించాడు. దీంతో కళ్యాణదుర్గం మండలం ఎం.వెంకటంపల్లికి చెందిన తన స్నేహితుడు ఫకృద్దీన్ అలియాస్ బాబా ఫకృద్దీన్‌ను సాయం కోరి, అన్న హత్యకు పథకం రచించాడు. ఇందులో భాగంగా గత నెల 14న రాత్రి పొలంలో ఒంటరిగా నిద్రిస్తున్న గోవిందప్పపై ఇనుప రాడ్‌తో దాడి చేసి హతమార్చారు. ఈ హత్య కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఐదు ప్రత్యేక బృందాలతో (ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్‌ఐలు, 10 మంది స్పెషల్ టీం కానిస్టేబుళ్లు, సాంకేతిక పోలీస్ టీం) దర్యాప్తు ముమ్మరం చేశారు. పక్కా ఆధారాలతో సోమవారం సాయంత్రం రాము, బాబా ఫకృద్దీన్‌ను అదుపులోకి తీసుకుని, విచారణ చేశారు. దీంతో గోవిందప్పను హత్య చేసిన తీరును వారు వివరించారు. హత్యకు ఉపయోగించిన ఇనుపరాడ్, రక్తపు మరకలు అంటిన దుస్తులు, రెండు సెల్‌ఫోన్లు, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేయడంతో నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

చోరీ చూసిందనే హతమార్చారు!

- అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీలు ప్రసాదరెడ్డి, వెంకటశివారెడ్డి



లక్ష్మీదేవి (ఫైల్)



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: హత్య, దొంగతనం కేసులో అంతర్రాష్ట్ర దొంగలను అనంతపురం సీసీఎస్, వన్‌టౌన్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి 33 గ్రాముల బంగారంతో పాటు నేరాలకు వినియోగించే ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ ప్రసాదరెడ్డి, సీసీఎస్ ఇన్‌చార్జ్ డీఎస్పీ వెంకటశివారెడ్డి వెల్లడించారు.

పట్టుబడింది వీరే..

గుంతకల్లులోని భాగ్యనగర్‌కు చెందిన షికారి సర్దార్ అలియాస్ బొంబాయి వాలా అలియాస్ రాజు, షికారి మద్దిలేటి అలియాస్ మదన్, అనంతపురంలోని షికారి కొట్టాలకు చెందిన బూజులు. ముగ్గురూ బృందంగా ఏర్పడి తాళం వేసిన ఇళ్లను ఎంపిక చేసుకుని చోరీలకు పాల్పడేవారు. ఈ క్రమంలో 2020లో అనంతపురలోని టీవీ టవర్ ఎదురుగా ఉన్న శివసాయి నగర్‌లో నిందితులు చోరీకి పాల్పడ్డారు. ఆ సమయంలో వారిని అక్కడే వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న కుమ్మర లక్ష్మీదేవి చూసి, గట్టిగా కేకలు వేసింది. దీంతో ఆమె తలపై రాడ్‌తో కొట్టి హతమార్చి, చెవి కమ్మలను అపహరించుకెళ్లారు.

పట్టుబడ్డారు ఇలా...

పాత కేసుల దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాలతో రంగంలో దిగిన సీసీఎస్, అనంతపురం వన్‌టౌన్ పోలీసులు మంగళవారం టీవీ టవర్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న రాజు, మదన్, బూజులుని అదుపులోకి తీసుకుని, తమదైన శైలిలో విచారణ చేయడంతో 2020లో తాము చేసిన ఘాతుకాన్ని వారు అంగీకరించారు. నిందితుల నుంచి 33 గ్రాముల బంగారంతో పాటు హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో మదన్‌పై ఉరవకొండ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప, సీసీఎస్ సీఐ జీటీ నాయుడు, ఎస్ఐ నాగరాజు, ఏఎస్‌ఐలు నాగేశ్వరరెడ్డి, రమేష్, సిబ్బంది షెక్షావలి, శ్రీనివాసులు, అనిల్, శ్రీధర్ ఫణి, రంజిత్, మల్లికార్జున, మురళీధర్, మోహన్, మహమ్మద్‌ను ఈ సందర్భంగా డీఎస్పీలు అభినందించారు.

ప్రశాంతంగా హెచ్‌ఎం పదోన్నతుల కౌన్సెలింగ్

రాప్తాడురూరల్: స్కూల్ అసిస్టెంట్ల నుంచి ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించేందుకు నిర్వహించిన కౌన్సెలింగ్ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. అనంతపురం సైన్స్ సెంటర్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 53 మందికి గాను ఒకరు నాట్ ఆప్టెడ్ ఆప్షన్ ఇచ్చారు. తక్కిన 52 మంది పదోన్నతులు పొందారు. పదోన్నతులు పొందిన టీచర్లను డీఈఓ అభినందించారు. కొత్త పాఠశాలల్లో విద్యాభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా జరిగేలా చూడాలని కోరారు. ప్రణాళిక ఏర్పాటు చేసుకుని పిల్లల చదువుపై దృష్టి సారించాలన్నారు. ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ పాఠశాలకు మంచి పేరు తెచ్చేలా కృషి చేయాలని సూచించారు. విద్యాశాఖ ఏడీ కృష్ణయ్య, సూపరింటెండెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక స్పృహతోనే వృత్తిలో రాణింపు

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



టోర్నీ విజేతగా నిలిచిన ఇటుకలపల్లి జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్

అనంతపురం: సామాజిక స్పృహతోనే వృత్తిలో రాణించగలుగుతారని యువతకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సూచించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో 40 రోజుల పాటు 'శ్రీసత్యసాయి, ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్, డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ'ని విజయవంతంగా నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విజేతలకు మంగళవారం ఆర్డీటీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ట్రోఫీలు, బహుమతుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో పాటు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడారు. శ్రీసత్యసాయి, ఫాదర్ ఫెర్రర్, దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సంస్మరణార్థం మెగా క్రికెట్ టోర్నీ నిర్వహించినట్లు గుర్తు చేశారు. భగవంతుడు పంపిన దూతలా స్పెయిన్ నుంచి ఇక్కడికి వచ్చి కరువు పీడిత ప్రజల భవిష్యత్తు కోసం ఎంతో శ్రమించి సాయం చేసిన మహనీయుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అని కొనియాడారు. జిల్లాలో తాగునీటి పథకాలకు ఆద్యుడు భగవాన్ శ్రీసత్యసాయి బాబా అని అన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ద్వారా ఎంతో మంది నిరుపేదల ప్రాణాలు కాపాడారన్నారు. వీరిద్దరి సేవలకు కొనసాగింపుగా జిల్లాకు తాగు, సాగునీరు తీసుకురావడం, ఆరోగ్యశ్రీ , ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత కరెంట్ అందించి లక్షలాది మందికి అండగా నిలిచిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని కొనియాడారు. వీరందరి పేరుతో నిర్వహించిన టోర్నీలో మూడు వేల మంది క్రీడాకారులు పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. టోర్నీ నిర్వహణలో ఆర్డీటీ సహకారం మరువలేనిదన్నారు. టోర్నీ నిర్వహణకు తోడ్పాటునందించిన ఎస్కేయూ వీసీ, రిజిస్ట్రార్ సేవలను కొనియాడారు. అనంతరం టోర్నీ విజేతగా నిలిచిన ఇటుకలపల్లి జట్టుకు రూ.1.20 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అందజేశారు. రన్నర్‌గా నిలిచిన చెన్నేకొత్తపల్లి జట్టుకు రూ.60 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30 వేలు, నాల్గో స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 15 వేలు అందించారు. టోర్నీలో పాల్గొన 191 జట్లకు క్రికెట్ కిట్లను అందజేశారు.

అత్తను హతమార్చిన అల్లుడు





అల్లుడు కృష్ణ, హత్యకు గురైన లక్ష్మమ్మ

అనంతపురం శ్రీ కంఠం సర్కిల్: తాగుడు మానేసి, బుద్ధిగా పని చేసుకుని బతకాలంటూ హితవు చెప్పినందుకు అత్తను ఓ అల్లుడు దారుణంగా హతమార్చాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతిసేన కాలనీలో నివాసముంటున్న బెస్త లక్ష్మమ్మకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె లలిత.. రెడ్డిపల్లికి చెందిన కృష్ణను ప్రేమించి పెళ్లి చేసుకుంది. అప్పటి నుంచి అత్తింటిలోనే అల్లుడు ఉంటూ వస్తున్నాడు. కాగా, పనీపాట లేకుండా జులాయిగా తిరుగుతూ పీకలదాకా మద్యం తాగి అర్ధరాత్రి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను ఇబ్బంది పెడుతుండడంతో అల్లుడిని పలుమార్లు అత్త మందలించింది. పద్ధతి మార్చుకోవాలని గట్టిగా మందలించడంతో లక్ష్మమ్మపై కృష్ణ కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న కృష్ణ నిద్రించి, సాయంత్రం మూడున్నర గంటలకు లేచాడు. ఆ సమయంలో అత్త మందలించడంతో పక్కనే ఉన్న రోకలి బండతో ఆమె తలపై బలంగా దాడి చేయడంతో రక్తపు మడుగులో ఆమె కుప్పకూలింది. అనంతరం ఇంటి పక్కనే ఉన్న తన స్నేహితుడు సుధీర్‌కు విషయం చెప్పి అక్కడి నుంచి పారిపోయాడు. సుధీర్ నుంచి సమాచారం అందుకున్న లక్ష్మమ్మ కుమారుడు శ్రీనివాసులు ఆగమేఘాలపై ఇంటికి చేరుకుని కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న తల్లిని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమార్తె లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శివరాములు తెలిపారు.

ఏపీలో విద్యకు అధిక ప్రాధాన్యత

- రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివా రెడ్డి



నాటా సభలో మాట్లాడుతున్న ఆలూరు సాంబశివా రెడ్డి

అనంతపురం: నేటి తరానికి మంచి చదువు అందిస్తే భవిష్యత్తులో మన రాష్ట్రం అన్నింటా అగ్రస్థానంలో ఉంటుందనే ఉద్దేశంతో విద్యకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. అమెరికాలోని డల్లాస్‌లో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాటా)నిర్వహించిన సభకు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ఆయన మంగళవారం నిర్వహించిన సభలో మాట్లాడారు. పేదరికం వల్ల ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదనేది సీఎం వైఎస్ జగన్ ఆశయమన్నారు. గడిచిన నాలుగేళ్లలో ఏపీలో ప్రభుత్వ బడుల రూపురేఖలు సమూలంగా మారిపోయాయన్నారు. ఏ కార్పొరేట్ విద్యా సంస్థ అందించలేని అద్భుతమైన వసతుల మధ్య పేద పిల్లలు చదువుకునేలా వనరులను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిందన్నారు. విద్యా రంగంపై పెట్టే ఖర్చు తక్షణమే ఫలితాలు ఇవ్వదని, ఇప్పటి విద్యార్థులందరూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకున్నాక ఆ ఫలాల ఫలితం ఏమిటో మనకు తెలుస్తుందన్నారు. కొన్ని దశాబ్దాల నుంచి విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్లే ఈ రోజు అమెరికా, ఐరోపా దేశాలు అగ్రస్థానంలో ఉన్నాయని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో రాష్ట్రంలో విద్యకు పెద్దపీట వేస్తున్నారన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన , జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలు, ఉచిత బైజూస్ కంటెంట్ తదితర పథకాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

గుత్తి రూరల్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... యాడికి గ్రామానికి చెందిన వీరన్న, దస్తగిరమ్మ (57) దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. అనంతపురంలోని బంధువులను పలకరించేందుకు మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై వీరన్న, దస్తగిరమ్మ బయలుదేరారు. మార్గమధ్యంలో గుత్తి మండలం కొత్తపేట శివారులో ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ప్రయాణిస్తుండగా బైక్ టైర్ పేలడంతో వాహనం అదుపు తప్పి దంపతులు కిందపడి, తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న వారు గమనించి 108 అంబులెన్స్ ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స ప్రారంభించేలోపు దస్తగిరమ్మ మృతి చెందింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు గుత్తి పోలీసులు తెలిపారు.

విద్యార్థి బలవన్మరణం



ఈశ్వర దత్త (ఫైల్)

అనంతపురం శ్రీ కంఠంసర్కిల్/ పెద్దవడుగూరు: జీవితంపై విరక్తితో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పెద్దవడుగూరు మండలం ముప్పాలగుత్తికి చెందిన సాంబశివరావు, లక్ష్మి దంపతుల ఒక్కగానొక్క కుమారుడు ఈశ్వర దత్త (20) అనంతపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 'ట్రిపుల్ ఈ' ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈ క్రమంలో పాలిటెక్నిక్ కళాశాలకు ఎదురుగా ఉన్న న్యూ రెవెన్యూ కాలనీలోని అద్దె గదిలో సహ విద్యార్థులతో కలసి ఉంటున్నాడు. సోమవారం రాత్రి భోజనం ముగించుకున్న తర్వాత స్నేహితులతో కాసేపు ముచ్చటించి నిద్రకు ఉపక్రమించారు. మంగళవారం ఉదయాన్నే నిద్ర లేచేసరికి గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని విగతజీవిగా వేలాడుతున్న ఈశ్వర దత్తను చూసి స్నేహితులు భయాందోళనకు గురయ్యారు. విషయాన్ని తెలుసుకున్న కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ప్రేమ వ్యవహారమే ఈశ్వర దత్త ఆత్మహత్యకు కారణంగా ప్రాథమిక దర్యాప్తులో వెలుగు చూసింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు అనంతపురం వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

పెళ్లి కాలేదనే బెంగతో ఉపాధ్యాయుడి ఆత్మహత్య

అనంతపురం సిటీ: పెళ్లి కాలేదన్న బెంగతో ఓ ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన మేరకు... పామిడి గ్రామానికి చెందిన ఉప్పర అమరేంద్ర (43), అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. తల్లి వెంకటలక్ష్మితో కలసి ఉంటున్నాడు. పుట్టుకతోనే వైకల్యంతో బాధపడుతున్న అమరేంద్రను పెళ్లి చేసుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై, జీవితంపై విరక్తి చెందిన ఆయన సోమవారం రాత్రి అనంతపురంలోని పీటీసీ సమీపంలో పట్టాల మీదకు చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యుల నియామకానికి చర్యలు

అనంతపురం సెంట్రల్: బాలల సంక్షేమం, సంస్కరణల సేవల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జువైనల్ జస్టిస్ బోర్డులో సోషల్ వర్కర్ సభ్యులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు బాలల సంక్షేమశాఖ జిల్లా పర్యవేక్షణ అధికారి ఫరూక్ బాషా మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో జువైనల్ జస్టిస్ (పిల్లల రక్షణ, సంరక్షణ)చట్టం-2021 మేరకు సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్, సభ్యులు, జువైనల్ జస్టిస్ బోర్డుల్లో సోషల్ వర్కర్ సభ్యుల నియామకాలను చేపట్టారు. 35 నుంచి 65 సంవత్సరాల మధ్య వయసు కలిగి, పిల్లల సేవలో అనుభవంతో పాటు ఇతర అర్హతలు ఉన్న వారుఅర్హులు. ఆసక్తి ఉన్న వారు నిర్దేశిత ఫార్మట్‌లో దరఖాస్తుతో పాటు వారి క్రెడెన్షియల్ నకళ్లను జతపరిచి ఈ నెల 13వ తేదీ లోపు విజయవాడలోని డైరెక్టర్ కార్యాలయానికి పంపాలి. పూర్తి వివరాలకు http://wdcw.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. అదనపు సమాచారానికి 95335 27986లో సంప్రదించవచ్చు.

చిరుత దాడిలో పొట్టేళ్లు మృతి

రాయదుర్గం రూరల్: చిరుత దాడిలో నాలుగు పొట్టేళ్లు మృతి చెందిన ఘటన రాయదుర్గం మండలం 74 ఉడేగోళంలో చోటు చేసుకుంది. వివరాలు.. 74 ఉడేగోళానికి చెందిన ఓబయ్య గారి పాపన్న తన నాలుగు పొట్టేళ్లను సోమవారం రాత్రి ఇంటి ఆవరణలో నిద్ర పోయారు. మంగళవారం తెల్లవారుజామున నిద్రలేచి ఇంటి బయటకు వచ్చి చూస్తే పొట్టేళ్లు మృతి చెంది ఉన్నాయి. చిరుత దాడిలో పొట్టేళ్లు మృతి చెందినట్లుగా నిర్ధారించుకుని సమాచారం అందించడంతో అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించి, నిర్ధారించారు.

క్లుప్తంగా

సింగంపల్లిలో పోలేరమ్మకు బోనాలు



సింగంపల్లిలో పోలేరమ్మకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

ఆత్మకూరు: మండలంలోని సింగంపల్లిలో మంగళవారం పెద్ద ఎత్తున గ్రామస్తులు బోనాల కార్యక్రమం నిర్వహించారు. ఆషాఢ మాసంలో ప్రతి మంగళవారం పోలేరమ్మ దేవతకు పెద్ద ఎత్తున ప్రతి ఇంటి నుంచి బోనాలు తీసుకెళ్లడం ఆనవాయితీ అని గ్రామస్తులు తెలిపారు.

అంగన్‌వాడీ సమస్యలపై పోస్టర్ల విడుదల

అనంతపురం సెంట్రల్: అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10న తలపెట్టిన ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు జమున పిలుపునిచ్చారు. మంగళవారం ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం నోటీసును సీడీపీఓ లలితమ్మకు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్ష్మిదేవి, మహబూబ్‌బి, అలీమా, అనిత, సంధ్య, సుభాషిణి, ఖాసింబీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి అష్టదళ పాద పద్మసేవ



పాదపద్మసేవల్లో పూజలందుకున్న శ్రీనివాసుడు

అనంతపురం కల్చరల్: నగరంలోని శ్రీనివాసనగర్‌లోని బాలాజీ మందిరంలో అష్టదళ పాద పద్మసేవలు మంగళవారం నేత్రపర్వంగా జరిగాయి. ఉదయం, సాయంత్రం వేర్వేరుగా శ్రీనివాసుడికి అభిషేకాలు, అర్చనలు, తిరుమంజన సేవతో పాటు వివిధ పుష్పాలతో అలంకార సేవలు జరిగాయి. భక్తులు బారులు తీరి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ తిరుమల క్షేత్రానికి పరిమితమైన అష్టదళ పాదపద్మ సేవలు శ్రీనివాసనగర్ బాలాజీ మందిరంలో జరుగుతున్నాయన్నారు. వచ్చేనెల 1న ఇదే సేవలు ఆలయంలో జరుగుతాయన్నారు.

టీపీబీఓలుగా అవకాశం కల్పించండి

అనంతపురం క్రైం: వివిధ మునిసిపాలిటీల్లో ఖాళీగా ఉన్న టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ (టీపీబీఓ) పోస్టుల్లో పట్టణ ప్రణాళిక కార్యదర్శులకు అవకాశం కల్పించాలని గ్రామ వార్డు సచివాలయ ఫెడరేషన్ (138/2020) నాయకులు టౌన్ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ సంజీవ్‌కుమార్‌ను కోరారు. మంగళవారం రాంనగర్‌లోని ఆర్డీ కార్యాలయంలో ఆర్డీకి వారు వినతిపత్రం సమర్పించారు. ప్రణాళిక కార్యదర్శుల విజ్ఞప్తిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆర్డీ సంజీవ్‌కుమార్ తెలిపారు. టౌన్ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్‌ను కలసిన వారిలో ఫెడరేషన్ కార్యదర్శి ప్రశాంత్‌కుమార్, ప్రణాళిక కార్యదర్శులు వినయ్, పాల్గుణ, గోపి, ధనుంజయ, నరేష్, సోము, రాధాకృష్ణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

13న బహిరంగ వేలం

అనంతపురం కల్చరల్: జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఈనెల 13న వేర్వేరు ప్రాంతాల్లో బహిరంగ వేలం ఉంటుందని జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. పెనకచర్ల డ్యాం వద్ద ఉండే పర్యాటకశాఖ నిర్మాణాలకు ప్రైవేట్ వ్యక్తులు లేదా సంస్థలకు 15 ఏళ్ల వార్షిక అద్దెతో కేటాయించడానికి వేలం నిర్వహిస్తున్నారు. గుత్తికోట వద్ద ఉండే పర్యాటకశాఖ నిర్మాణాలకు కూడా అదేరోజు ఉదయం 11.30 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనాస్పత్రి ఎదురుగా ఉన్న జిల్లా పర్యాటకశాఖ కార్యాలయంలో వేలం ఉంటుందన్నారు. వివరాలకు జిల్లా అధికారి సెల్: 9121144085లో సంప్రదించాలని కోరారు.

ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాం

- 'జగనన్న సురక్ష'లో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ఆత్మకూరు: ఎన్నికల ముందు నియోజవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చి మాట నిలబెట్టుకున్నాం.. ఎన్నికల సమయంలో మాత్రమే తమకు పార్టీలు అని .. ఎన్నికల తర్వాత ప్రజలే ముఖ్యమని, గ్రామాల్లో కక్షలు పెంచి ప్రజల మధ్య గొడవలు టీడీపీ వాళ్లు సృష్టిస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామం సస్యశ్యామలంగా మారిందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలియజేశారు. మంగళవారం సనప గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ముఖ్యమంత్రి జగనన్న చిత్ర పటానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌తో కలిసి క్షీరాభిషేక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలతో సంబంధం లేకుండా పథకాలు అందించామన్నారు. టీడీపీ జీవితకాలంలో చేయలేని మంచి పనులు వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత నాలుగేళ్లలో పూర్తి చేశామన్నారు. ఈ నెల 8న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కల్యాణదుర్గం వస్తున్నారని తోపుదుర్తి రిజర్వాయర్‌పై చర్చించి, ఎన్నికలలోపు తోపుదుర్తి రిజర్వాయర్ 25 శాతం పనులు అయ్యేలా చేస్తామని తెలిపారు.

తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మీ బిడ్డ..

నేను మీ ఇంటి బిడ్డను.. ఏ కష్టం వచ్చినా అండగా ఉంటాను.. నన్ను నమ్మండి.. అధికారం కోసం పరిటాల కుటుంబం గ్రామాల్లో చిచ్చు పెడుతోందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గ్రామస్తులకు తెలిపారు. గత ప్రభుత్వంలో కేవలం టీడీపీ వాళ్లకే పథకాలు అందితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ అందాయన్నారు. పీఏబీఆర్ నుంచి ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు సంబంధించి రూ.65 కోట్లు టెండర్లు పూర్తి అయ్యాయన్నారు. ఇంత వరకూ ఏ ఎమ్మెల్యే, మంత్రులు కూడా మంచి నీటి పైప్‌లైన్ కూడా చేయించలేదన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 17 వేల ఇళ్లను మంజూరు చేయించామన్నారు. ఈ నెల 10 నుంచి అమ్మ డెయిరీకి పాలు సేకరిస్తామన్నారు. అందరి కన్నా లీటరుపై ఒక రూపాయి అదనంగా ఇస్తామని , ప్రతి 90 రోజులకు డెయిరీలో వచ్చిన లాభాన్ని మహిళలకే పంచిపెడుతామన్నారు. 2024లో వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ షర్మిల, ఎంపీపీ సుబ్బరహేమలత, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, నీలిమ, ఎంపీటీసీ పుష్పావతి, రంగంపేట సర్పంచ్ ఉజ్జినప్ప, గ్రామ సచివాలయాల కన్వీనర్ నరసింహారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, నరసింహా, అతికిరెడ్డి, భాస్కర్, భాస్కర్‌రెడ్డి ,మాజీ సర్పంచ్ యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి

అనంతపురం క్రైం: 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేసీఎస్ కన్వీనర్, కార్పొరేటర్లు తెలిపారు. మంగళవారం 30,32 డివిజన్ల పరిధిలోని 29,45,46 సచివాలయాల్లో సమావేశం నిర్వహించారు. జేసీఎస్ కన్వీనర్ చింతకుంట మధు, కార్పొరేటర్లు నరసింహులు, కమల్ భూషణ్, ఎంఎల్‌ఓ అమర్‌నాథ్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో ఆశా డే

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదంర్భంగా ఏఎన్‌ఎంలకు, ఆశావర్కర్లకు ఆరోగ్య విషయాలపై పలు సూచనలు చేశారు. డాక్టర్ దయాకర్ మాట్లాడుతూ ఆశాలు రోజువారీగా గర్భిణులు, బాలింతలు ఇచ్చే సేవలను ఆశా యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే బాలామృతం, చిక్కీలు, ప్రతి ఆరు నెలలకోసారి ఇచ్చే డీ వార్మింగ్ మాత్రల ద్వారా రక్తహీనతను నివారించొచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ నాగేశ్వరయ్య, పీహెచ్‌ఓ తులశమ్మ పాల్గొన్నారు.

భూమి కబ్జా చేయలేదు

అనంతపురం టవర్‌క్లాక్: అనంతపురం రూరల్ పరిధిలో గొల్లపల్లి పొలంలో సర్వేనంబర్ 28-2లో 10 ఎకరాల భూమిని కబ్జా చేశారని పచ్చ మీడియా ప్రచారం చేయడం దారుణమని కేవీ రమణ, సీపీ వీరన్న అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2008లో అప్పటి వైఎస్సార్ ప్రభుత్వంలో తమకు 10 ఎకరాలు భూమిని కేటాయించారన్నారు. ఆ భూమిని పచ్చ మీడియా వక్రీకరించి కబ్జా చేశారని రాయడం సరికాదన్నారు. వీటిపై పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు.

మరుగుదొడ్ల పరిశీలన



జెడ్పీలో ఆధునికీకరించిన మరుగుదొడ్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ కార్యాలయంలోని మరుగుదొడ్లను జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మంగళవారం పరిశీలించారు. అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లతో జెడ్పీ ఉద్యోగులతో పాటు కార్యాలయానికి వచ్చే ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల వారు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ స్పందించారు. తక్షణం మరమ్మతులకు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతానికి కింది పోర్షన్‌లోని మరుగుదొడ్లను అన్ని హంగులతో ఆధునీకరించారు.

రైతులందరికీ పరిహారం ఇవ్వాలి

అనంతపురం అగ్రికల్చర్: పంట పెట్టి నష్టపోయిన ప్రతి రైతుకూ పంటల బీమా కింద పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పంటల బీమాలో వేరుశనగ రైతులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. అధికారులు వేసిన లెక్కలకు, క్షేత్రస్థాయిలో రైతులకు జరిగిన నష్టాలకు పొంతనలేకుండా పోయిందన్నారు. నాయకులు శివారెడ్డి, ఎం.నాగమణి, రాజారామిరెడ్డి, చెన్నారెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కుక్కలకు ఉచితంగా రేబీస్ టీకాలు



కుక్క కాటుకు రేబీస్ వ్యాప్తి



ప్రపంచ రేబీస్ దినోత్సవ చిత్రం

- పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి సుబ్రహ్మణ్యం

అనంతపురం అగ్రికల్చర్: ప్రపంచ జూనోసీస్ డేను పురస్కరించుకుని గురువారం స్థానిక సాయినగర్ పశువుల ఆస్పత్రిలో వీధి కుక్కలు, పెంపుడు కుక్కలకు రేబీస్ నివారణ టీకాలు ఉచితంగా వేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జంతువుల ద్వారా మనుషులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులని పిలుస్తారని తెలిపారు. ఈ క్రమంలో 1885 జూలై 6న లూయీ పాశ్చర్ అనే శాస్త్రవేత్త రేబీస్ వ్యాధి నివారణకు టీకాలు కనుగొన్న సందర్భాన్ని పురస్కరించుకొని ప్రపంచ వ్యాప్తంగా జూలై 6న జూనోసీస్ డేను జరుపుకుంటారని తెలిపారు. ఈ క్రమంలో వాటి ద్వారా రేబీస్, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసీస్, లాప్టోస్పైరిస్ లాంటి ప్రమాదకర, ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యాధుల పట్ల మనుషుల్లో అవగాహన కలిగివుంటే ఎలాంటి సమస్యా ఉండదన్నారు. ప్రధానంగా మనుషులకు రేబీస్ వ్యాధి ఎక్కువగా వ్యాపించడం జరుగుతోందన్నారు. వ్యాధి వ్యాపించిన తర్వాత కన్నా ముందుగానే టీకాలు వేయించడం ద్వారా రేబీస్‌ను అదుపులో పెట్టవచ్చన్నారు. స్థానిక సాయినగర్ పశువుల ఆస్పత్రితో పాటు పట్టణ ప్రాంతాల ఆసుపత్రుల్లో జూనోసీస్ డేను పురస్కరించుకుని గురువారం కుక్కలకు ఉచితంగా రేబీస్ నివారణ టీకాలు వేస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇళ్ల పట్టాలపై సునీత దుష్ప్రచారం



వైరల్ అయిన వీడియోలో మాట్లాడుతున్న శంకర్‌నారాయణరెడ్డి

ఆత్మకూరు: బి.యాలేరులో ఇళ్ల పట్టాల విషయంలో మాజీ మంత్రి పరిటాల సునీత దుష్ప్రచారం చేస్తున్నారు. ఎస్సీల ఇళ్ల పట్టాలు రద్దు చేశారంటూ వక్ర భాష్యం చెప్తూ నీచ రాజకీయానికి తెరలేపారు. పట్టాల పంపిణీ వ్యవహారంపై టీడీపీకి చెందిన నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శంకర్‌నారాయణరెడ్డి మాట్లాడిన మాటలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. రాజకీయ లబ్ధి కోసమే పరిటాల సునీత ఆరాట పడుతున్నారనేది స్పష్టమవుతోంది. 2013లో వైఎస్సార్‌సీపీ నేత తోపుదుర్తి రాజశేఖరరెడ్డి గ్రామంలో పర్యటించినపుడు ఎస్సీలు తమకు ఇంటి స్థలాలు లేవని తెలిపారు. తాము ఇంటి స్థలాలు ఇప్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఎస్సీలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం కోసం అప్పట్లో వైఎస్సార్‌సీపీలో ఉన్న మాజీ ఎంపీటీసీ సభ్యుడు శంకర్‌నారాయణరెడ్డికి ఆయన రూ.2లక్షలు ఇచ్చి ఓ మహిళతో భూమి కొనుగోలు చేసి, అగ్రిమెంట్ చేయించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి కొనుగోలు చేయించిన భూమిలో 200 మందికి పైగా ఇంటి పట్టాలు ఇప్పించారు. ఆ సమయంలో శంకర్‌రెడ్డి టీడీపీలోకి వచ్చారు. అయితే ఇక్కడ పట్టాలు పొందిన వారిలో అనర్హులు ఉన్నందున ... అర్హులైన వారికి ఇచ్చేందుకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చర్యలు చేపట్టారు. అయితే పరిటాల సునీత ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకుంటున్నారు. దళితుల ఇళ్ల పట్టాలు రద్దు చేయించారంటూ దుష్ప్రచారం చేశారు. కొంతమంది ధర్నా కూడా చేశారు. అయితే ఈ ధర్నా చేసిన వారిలో ఎక్కువమంది అనర్హులే ఉన్నారని టీడీపీలో కొనసాగుతున్న మాజీ ఎంపీటీసీ సభ్యుడు శంకర్‌నారాయణరెడ్డి చెప్పిన మాటలు వైరల్ అయ్యాయి.

ఏసీ, లిఫ్ట్‌లు మరమ్మతు చేయించాలి



ఆర్థో వార్డు సిబ్బందితో మాట్లాడుతున్న సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్, ఐసీయూ, అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్ (ఏఎంసీ), తదితర క్రిటికల్ కేర్ వార్డుల్లో ఏసీలు, లిఫ్ట్, సూపర్ స్పెషాలిటీలో లిఫ్ట్‌ను సాధ్యమైనంత త్వరగా రిపేరి చేయించాలని ఏపీఎంఐఎస్ఐడీసీ ఇన్‌చార్జ్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డిని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు ఆదేశించారు. మంగళవారం సూపరింటెండెంట్ సర్వజనాస్పత్రిలోని మేల్ మెడిసిన్ (ఎంఎం), ఆర్థో, ఐసీయూ, ఓటీ తదితర వార్డులను తనిఖీ చేశారు. రోగులందుతున్న సేవలపై ఆరా తీశారు. సూపరింటెండెంట్ వెంట ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ సునీత, ఆర్థో హెచ్ఓడీ డాక్టర్ ఆత్మరాం, గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని, పాల్గొన్నారు.

సిబ్బందితో సమావేశం : అనంతరం సూపరింటెండెంట్ ఆఫీస్ కార్యాలయం సిబ్బందితో మంగళవారం మధ్యాహ్నం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, స్పందన, తదితర ఫైళ్లను సకాలంలో నివృత్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఆఫీస్ సూపరింటెండెంట్లు రమణ, వేణుగోపాల్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అల్లూరి అడుగుజాడల్లో నడుద్దాం



జేఎన్‌టీయూ అనంతపురం పాలకభవనంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వీసీ జింకా రంగజనార్దన తదితరులు

అనంతపురం: అల్లూరి సీతారామరాజు అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఎస్కేయూలో అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఎస్కేయూ వీసీ నివాళి అర్పించారు. కార్యక్రమంలో క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రామచంద్ర, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

- జేఎన్‌టీయూ అనంతపురం పాలకభవనంలో మంగళవారం విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళి అర్పించారు. జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజుకు చిన్నప్పటి నుంచి దైవభక్తి, నాయకత్వ లక్షణాలు, దానగుణం ఉండేదన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ అనంతపురం రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సుజాత, ప్రొఫెసర్ వి. సుమలత, ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మన్యం వీరుడికి ఘన నివాళి

అనంతపురం శ్రీకంఠం సర్కిల్ : విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 126వ జయంతి సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ విజయ భాస్కర్ రెడ్డి నివాళులర్పించారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మాట్లాడారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ శంకర్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సుధాకర్ రెడ్డి, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఎస్కేయూలో నివాళి అర్పిస్తున్న వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి

జగన్‌తోనే ముస్లింల జీవితాల్లో వెలుగు



అనంతపురంలోని గుత్తి రోడ్డు మసీదులో బ్రోచర్ విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లింల జీవితాల్లో వెలుగులు నింపారని మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ అన్నారు. నగరంలోని గుత్తి రోడ్డులో గల మసీద్ ఫిర్దోస్ మసీదులో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'హర్ దిల్ మే వైఎస్సార్-హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ అన్ని విధాల వెనుకబడిన ముస్లింలు అన్ని రంగాల్లో ముందుకు రావాలంటే చదువు ఒక్కటే పరిష్కారమని సంకల్పించి వైఎస్ రాజశేఖరరెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేశారన్నారు. ముస్లింలను రాజకీయంగా అణగదొక్కిన చంద్రబాబు.. ఇప్పుడు ముస్లింలకు దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, ఇషాక్, ముతవల్లి షబ్బీర్, ఇమామ్ మౌలానా షబ్బీర్, కమిటీ సభ్యులు మహమ్మద్ రఫీ, తాజుద్దీన్, ఖాజా పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

అనంతపురం: పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని బ్లాక్ డెవలప్‌మెంట్ ప్లాన్ స్టేట్ రీసోర్స్ పర్సన్ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. అనంతపురం డీఆర్‌డీఏ కార్యాలయంలో ట్రైనర్స్ ఆఫ్ ట్రైనీలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యుల రుణాలు ఇచ్చే విషయంలో జవాబుదారీతనం పెంపొందాలన్నారు. రికార్డుల నిర్వహణ సరైన రీతిలో ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ లావణ్య కుమారి, డీఆర్‌డీఏ పీడీ నరసింహా రెడ్డి, సెర్ప్ ఐబీ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ ఏపీడీ ఈశ్వరయ్య, ఏపీఎం అనిత, తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 క్రికెట్ టోర్నీలో 'అనంత'కు రెండో స్థానం

కడప స్పోర్ట్స్: వైఎస్సార్ జిల్లా కడప లో నిర్వహించిన ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-19 క్రికెట్ టోర్నీలో అనంతపురం జట్టుకు రెండో స్థానం దక్కింది. మంగళవారంతో టోర్నమెంట్ ముగియగా పాయింట్ల పట్టికలో 12 పాయింట్లతో కడప జట్టు అగ్రస్థానంలో నిలువగా, 8 పాయింట్లతో రెండోస్థానంలో అనంతపురం నిలిచింది. కాగా మంగళవారం వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 44.2 ఓవర్లలో 158 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 44 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసి, విజయం సాధించింది.

ఏసీపీకి వాహనమేదీ?

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలోని అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలాజీకి గత పదిహేను రోజులుపైగా వాహనం కేటాయించకపోవడం చర్చనీయాంశమైంది. గత నెలలో ఏసీపీగా బాలాజీ బాధ్యతలు తీసుకున్న విషయం విదితమే. గతంలో ఏసీపీ శ్రీనివాసులు రెడ్డి, సువర్ణకు రెండు వాహనాలుండేవి. వారు బదిలీపై వెళ్లాక ఏసీపీకి వాహనం కేటాయించలేదు. క్షేత్రస్థాయిలో పర్యటించే అధికారికే వాహనం లేకపోవడం వివాదానికి దారితీస్తోంది.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

రాప్తాడురూరల్: మత్తు పదార్థాలకు బానిసలైతే బంగారు లాంటి జీవితాల్ని నాశనం చేసుకున్నట్లేనని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 అధికారి నగరూరు రసూల్ పేర్కొన్నారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 'డ్రగ్ రహిత సమాజం'పై అవగాహన కల్పించారు. మత్తుపదార్థాల వాడకం వలన జరిగే దుష్పరిణామాలను విద్యార్థులకు వివరించారు.ఎన్ఎస్ఎస్ వలంటీర్స్ సాంబ, అశోక్, ప్రత్యూష, నిషా, భవ్య, జ్ఞానేష్, సుచిత్ర, ప్రీతి, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

'మల్లెల'కు జాతీయ పురస్కారం



అనంతపురం కల్చరల్: మధుర కవిగా ప్రసిద్ధులైన జిల్లాకు చెందిన సాహితీవేత్త మల్లెల నరసింహమూర్తికి మరో పురస్కారం దక్కింది. ఆయన రచించిన 'జల స్వప్నం' కవితను పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ జాతీయ కవితా పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ నెల 9న హైదరాబాదులో జరిగే సాహితీ సభలో ప్రముఖుల చేతుల మీదుగా ఈ అవార్డును ఆయన అందుకోనున్నారు. జాతీయ పురస్కారానికి ఎంపికైన మల్లెల నరసింహమూర్తిని కేజీఎస్ మనోరంజని, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, డాక్టర్ రాచపాలెం చంద్రశేఖర రెడ్డి, డాక్టర్ కాంతినారాయణ, చెట్ల ఈరన్న అభినందించారు.